విశాలాంధ్ర

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా

బుధవారం 26, జూన్ - 2024 4 పేజీలు

ట్రిపుల్ ఐటి కళాశాలలో బిట్రగుంట విద్యార్థినికి బంగారు పతకం

విశాలాంధ్ర-బిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాథరావుపేటకు చెందిన ఇమ్మడిశెట్టి వెంకటేశ్వర్లు, కళ్యాణి దంపతుల కుమార్తె శ్రీప్రియ కర్నూలులోని ట్రిపుల్ ఐటి కళాశాలలో ఈఎన్‌సీ బ్రాంచి టాపరుగా నిలిచింది. బంగారు పథకం సాధించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో నీతి అయోగ్ సభ్యుడు డాక్టర్ వి కె సరస్వత్ ఆమెకు ప్రశంసా పత్రాన్ని బంగారు పతకాన్ని బహుకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుల్లో ఉన్నత ఫలితాలు సాధించినప్పుడు తల్లిదండ్రులు పడ్డ శ్రమకు గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రస్తుతం బెంగళూరులో ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంకులో ఇంటర్న్ షిప్ చేస్తున్న శ్రీప్రియ పీహెచ్ డి చేయడమే తన ధ్యేయం అంటుంది.

పెరిగిన పెన్షన్.. లబ్ధిదారు ఆనందించెన్..

జూలై 1 నుంచి ఇంటి వద్దకే ఎన్టీఆర్ భరోసా



విశాలాంధ్ర - కొండాపురం : సామాజిక పెన్షనర్ల కష్టాలు తీరనున్నాయి. గత ప్రభుత్వ హయాంలో వాలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే ప్రతినెల 1వ తేదినే పింఛన్ అందించేవారు. ఎన్నికల కోడ్ దృష్ట్యా గత ఏప్రిల్ నెల పెన్షన్ సచివాలయ ఉద్యోగుల ద్వారా సచివాలయాల్లో అందజేశారు. మే, జూన్ మాసాలకు సంబంధించిన పెన్షన్ లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ఆ నగదును తీసుకోవడానికి పెన్షనర్లు బ్యాంకుల చుట్టూ రోజుల తరబడి తిరిగారు. పింఛన్ కోసం తిరిగే క్రమంలో వడదెబ్బకు పలువురు వృద్ధులు మరణించారు. ఇక పెన్షనర్ల కష్టాలు తీరనున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సోమవారం జరిగిన మంత్రి మండలి సమావేశంలో జూలై1న సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటి వద్దకే పింఛన్ అందజేసే నిర్ణయం తీసుకున్నారు. దీంతో వృద్ధులు, వికలాంగులు, మంచానికే పరిమితమైన వ్యాధిగ్రస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పింఛన్ కానుక పథకాన్ని ఎన్టీఆర్ భరోసాగా మార్చారు. వృద్ధులు, వితంతువులు, కల్లుగీత, చేనేత, మత్స్యకారులు, డప్పు కళాకారులకు ఎన్నికల హామీలో భాగంగా ఏప్రిల్ ,మే జూన్ మూడు నెలలకు నెలకు వెయ్యి రూపాయలు చొప్పున రూ.3,000, జూలై పింఛను రూ.4000 కలిపి జూలై 1న రూ.7,000 అందించనున్నారు. దివ్యాంగులు సాయం రూ .3,000 నుంచి రూ.6,000 కు పెరిగింది. దివ్యాంగులు జూలై 1న రూ. 15,000 అందుకుంటారు. కుష్టు వ్యాధి గ్రస్తులకు నెలకు రూ .6000, కిడ్నీ ,కాలేయం, గుండె మార్పిడి వారికి నెలకు రూ .10,000, మంచానికే పరి మితమైన వారికి

2

పేదలభూముల్లోని వైసీపీ కార్యాలయాలను

వెంటనే ప్రభుత్వానికి అప్పగించాలి: జనసేన

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : నెల్లూరు సిటీలోని వెంకటేశ్వరపురం దగ్గర జనార్ధన్ రెడ్డి కాలనీలోగతంలో పేదలటిడ్కోఇళ్లకోసం కేటాయించిన భూమిలో నిబంధనలకు విరుద్ధంగా, ప్రజాసంపదను ఆక్రమిస్తూ కట్టిన వైసిపిభవనాలను వెంటనే ప్రభుత్వానికి అప్పజెప్పాలంటూ జనసేన పార్టీ జాతీయ మీడియా ప్రతినిధి వేములపాటి అజయ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి పాలన వారు ఆడిందే ఆట, పాడిందే పాట, చెప్పిందే న్యాయం, చేసిందే చట్టంగా వ్యవహరించారని విమర్శించారు. పేదలకు ఆరు అంకణాలు స్థలాలు ఇచ్చేదానికి 66 సార్లు ఆలోచించి, చివరికి అది కూడా ఇవ్వకుండా వైసిపి నేతలు వ్యక్తిగతంగా దోచేసిన భూములే కాకుండా , ఇప్పుడు ఏకంగా వైసిపి పార్టీ భవనాల పేరుతో కూడా పేద ల భూములను దురాక్రమణ చేసారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజులను, రాజరికాలను,సామంత రాజులను మరపించే విధంగా రాజద్రోహం కేసులు,రాచరిక అలవాటులను తిరిగి గుర్తుచేసిన వైసీపీ పతనమైంది. పేదలకు ఇవ్వాల్సిన టిడ్కో భూములు అయితే ఏమి , ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించిన భూములు అయితే ఏమి,ఎక్కడపడితే అక్కడ , ఎలాపడితే అలా అన్యాయంగా ఆక్రమించి ఆర్భాటంగా వైసిపి పార్టీ భవనాలను నిర్మించడం హేయమని చర్య అన్నారు. ఆ రోజున ఈ దుష్ట వైసీపీ నాయకులకు సహరించిన అధికారులు అందరూ కూడా ఈ దుర్మార్గానికి బాధ్యులేనన్నారు. మరొకసారి ఈ విధమైన చర్యలు జరగకుండా , ఎవరు కూడా ఇలాంటి నీచులకు సహకరించడానికి భయపడేటట్లు అధికారుల మీద కూడా చర్యలు తీసుకుని, శిక్షలుపడేటట్లుచూడాలి . ఈ వైసీపీభవన నిర్మాణ బాధ్యతలని జగన్‌కి అత్యంత ఆప్తుడైన రాంకీ ఇన్‌ఫ్రా అనే సంస్థకి అప్పజెప్పడం దారుణమన్నారు. ఈ నిర్మాణాలకు బదులుగా రాంకీ ఇన్‌ఫ్రా వాళ్ళకి అనకాపల్లిలో జగన్ 50ఎకరాలు కట్టబెట్టి అందులోపది ఎకరాలకు మాత్రమే డబ్బు కట్టించడం చూస్తుంటే మాకు పూర్వపు రోజులు గుర్తొస్తున్నాయి. వస్తు మార్పిడి పద్ధతి అనేది పూర్వపు రోజుల్లో అలవాటులో ఉండేదని, అవన్నీ మర్చిపోయిన రోజుల్లో పాతపద్ధతులను జగన్గుర్తు చేస్తున్నాడు. 26 జిల్లాల్లో కలిపి దాదాపుగా 42.24 ఎకరాలు కేటాయించగా, వాటి విలువ రూ.688 కోట్లు ఉంటుందని అంచనా.వీటన్నిటిని సమగ్రంగా పరిశీలించి న్యాయమైన చర్యలుతీసుకొని జగన్ చెప్పినట్లుగా అక్రమ కట్టడాలను ప్రభుత్వానికి అప్పగించాల్సిందిగా జనసేన పార్టీ డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్,జనసేన నాయకులు,నూనె మల్లికార్జున యాదవ్, రవి, కారంపూడి కృష్ణ రెడ్డి, శ్రీరామ్, చిరంజీవి యువత అధ్యక్షులు సురేష్, కృష్ణ పెన్నా రిజినల్ కో ఆర్డినేటర్ నగరత్నం యాదవ్, గుర్రం కిషోర్, సుధా మాధవ్, హరిరెడ్డి,భక్తవత్సల్ నాయుడు,శ్రీకాంత్, పవన్,హేమచంద్ర యాదవ్,ప్రశాంత్ గౌడ్,జనసేన మహిళానాయకులు ఇందిరా, భారతి, హసీనా, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.లవన్న ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు :నెల్లూరు, జిల్లాలో ప్రభుత్వ సంస్థ ల్లో పనిచేసే ఎన్ఎంఆర్, దినసరి ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్. లవన్న అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని శంకరన్ హాల్ లో ప్రభుత్వ సంస్థ ల్లో ఎన్.ఎం. ఆర్ ,దినసరి వేతనాల ఉద్యోగులకు కనీస వేతనాల అమలుపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ జిల్లాలో 2024-25 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ సంస్థ ల్లో పనిచేసే ఎన్. ఎం.ఆర్ మరియు దినసరి వేతనాల ఉద్యోగులకు వేతనాలుఅమలు చేయడానికి కమిటీ నిర్ణయించిందన్నారు.నైపుణ్యం లేని ఉద్యోగులకు 560 రూపాయలు, అర్ధ నైపుణ్యం కలిగిన వారికి 665 రూపాయలు, నైపుణ్యం కలిగిన వారికి 794 రూపాయలు, ఉన్నత స్థాయినైపుణ్యం కలిగిన వారికి 907 రూపాయలువేతనాలు ఇవ్వాలని కమిటీ నిర్ణయించినట్లు తెలియజేశారు. కమిటీ నిర్ణయించిన వేతనాలు 2025 మార్చి నెల వరకు అమలులో ఉంటాయన్నారు.అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తమ శాఖల్లో అమలు చేయాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, పంచాయతీ రాజ్ ఎస్.ఇ అశోక్ కుమార్, ఆర్%డ%బి ఎస్.ఇ గంగా రావు,బి. ఎస్.ఎన్. ఎల్ జనరల్ మేనేజర్ హరి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

- స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు ముమ్మరం.. జిల్లా వైద్యాధికారి డాక్టర్ పెంచలయ్య

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : జిల్లాలోని స్కానింగ్ సెంటర్లలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పెంచలయ్య పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం నగరంలోని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కార్యాలయంలో పిసి పిఎన్డిటి (గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం) కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వైద్యులు, ఎన్జీవో నాయకులు హాజరై ఆడపిల్లల సంరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, స్కానింగ్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు, భ్రూణ హత్యల నివారణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆడపిల్లల ప్రాధాన్యత, ఆవశ్యకతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం, బాలిక విద్యను ప్రోత్సహించడం వంటి అంశాలపై కమిటీ సభ్యులు చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ సమాజంలో రోజు రోజుకి ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతుందని, ఆడపిల్లల ప్రాధాన్యతపై సమాజంలో అవగాహన కల్పించాలన్నారు. ఆడపిల్లల గొప్పతనం, ఆవశ్యకతపై గ్రామ, మండల స్థాయిలో ర్యాలీలు, పాఠశాలలు, కళాశాలల్లో వక్తృత్వ వ్యాసరచన పోటీలు నిర్వహించాలని కమిటీ సభ్యులకు సూచించారు. అన్ని స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి, ఎవరైనా గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు రుజువైతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరు కూడా ఆడపిల్లలను ప్రోత్సహించేలా సమాజంలో తమ వంతు కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

మహిళల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

- గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ గీతా లక్ష్మి

సమాజంలో మహిళల ఆరోగ్యానికి ప్రతి ఒక్కరూ అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వ ఆసుపత్రి గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ గీతా లక్ష్మి అన్నారు. ఎక్కువమంది

2

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో పని చేయండి

- జాయింట్ కలెక్టర్, పలు శాఖల అధికారులతో సమావేశంలో మంత్రి ఆనం

విశాలాంధ్ర-నెల్లూరు: జిల్లా సమగ్రాభివృద్ధికి అధికారులందరూ అంకితభావంతో పనిచేయాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నెల్లూరు నగరంలోని సంతపేటలో గల క్యాంప్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్, పలు శాఖల జిల్లా స్థాయి అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో మంత్రి సమావేశమై ప్రజా సమస్యల పరిష్కార దిశగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారులందరూ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. ప్రధానంగా ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించి సాగునీరు, తాగునీరు, రహదారుల నిర్మాణం, గ్రామాల్లో అభివృద్ధి పనులు మొదలైన ప్రాధాన్యత అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి అధికారులకు సూచించారు. జేసీసేదు మాధవన్, ఆర్ అండ్ బి ఎస్ఈ గంగాధర్, ఈఈ మురళీకృష్ణ, ఆర్ డబ్ల్యు ఎస్, పంచాయతీ రాజ్, సోమశిల ప్రాజెక్టు, జిల్లా పంచాయతీ అధికారి, పలు విభాగాల అధికారులు, పలువురు ఉన్నతాధికారులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

పెరిగిన పెన్షన్.. లబ్ధిదారు ఆనందించెన్..

(మొదటి పేజీ తరువాయి)

నెలకు 15,000 అందజేస్తారు. ఎన్నికల ప్రచార సమయంలో పెన్షన్ల పెంపు గురించి కూటమి ఇచ్చిన హామీని వైసీపీ నేతలు ఇది అమలుకు సాధ్యం కానీ హామీ అన్నారు. కానీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి మంత్రివర్గ సమావేశంలోనే పెన్షన్ల పెంపుకు ఆమోదం తెలపడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. రాష్ట్రం అప్పుల్లో ఉండడం, రాజధాని అభివృద్ధి కొరకు భారీగా వ్యయం కావాల్సి ఉండడంతో పలువురు పెన్షనర్లు పెరిగిన మొత్తాన్ని కొంతకాలం పాటు ప్రభుత్వానికే తిరిగి విరాళంగా అందించేందుకు సిద్ధపడుతున్నారు.

గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

సంతానాన్ని కన్నడం, ఎక్కువసార్లు ఆపరేషన్లు చేయడం ఆడవారి ఆరోగ్యానికి ప్రమాదకరమని, ప్రతిఒక్కరు కూడా అవగాహనతో ఒక్కరు ముద్దు.. ఇద్దరు హద్దు అనే నినాదాన్ని పాటించాలని ఆమె ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో అవగాహన లేకపోవడంతో ఎక్కువమంది ముగ్గురు కంటే ఎక్కువ సంతానం కలిగి ఉండి, పేదరికం, ఆర్థిక సమస్యలు, చదివించ లేకపోవడం వంటి కారణాలతో ఇబ్బందులు పడుతున్నారని ఆమె చెప్పారు. ఆడపిల్లలపై ఉన్న అపోహలను పారద్రోలి ఆడపిల్లలను ప్రోత్సహించాలని, ఇంటికి దీపం ఆడపిల్ల అని, బాలిక విద్యతో సమాజంలో అభివృద్ధి సాధ్యం అనే విధంగా అవగాహన కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహించాలని ఆమె సూచించారు. ముఖ్యంగా గర్భిణులు చాలా అనారోగ్యంగా ఉంటున్నారని, రక్తహీనతతో కాన్పులకు వస్తున్నారని, దీంతో కాన్పు సమయంలో ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గర్భిణుల ఆరోగ్యం పట్ల ఆయా కుటుంబాలు ప్రత్యేక శ్రద్ధ చూపేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలోనే అవగాహన కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో వైద్యులు గీతా లక్ష్మి, డాక్టర్ కిరణ్, డాక్టర్ లక్ష్మీప్రసన్న, ఎన్జీవో నాయకులు కుసుమ కుమారి, శ్రీనివాసరావు, డెమో అధికారులు శ్రీనివాసరావు, కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

హిందీ పండిట్‌కు షో కాజ్ నోటీసు.?

విశాలాంధ్ర-కందుకూరు రూరల్ :ఎదుటివారికి చెప్పేటందుకే నీతులు ఉంటాయి అన్న చందంగా బివి రమణ వ్యవహార శైలి వలేటివారిపాలెం మండలం, పోకూరు జిల్లా పరిషత్ హై స్కూల్ లో హిందీ పండిట్ గా పనిచేస్తున్న బల్లిపల్లి వెంకట రమణ (బి వి రమణ)ఈ నెల 13 .నుండి 21. వరకు సెలవు(ఈఎల్)పెట్టిన దరిమెల 22వ తేదీ ఉన్నత పాఠశాలకు వచ్చి, రెండు పూటలా సంతకాలు పెట్టి, ఉదయం 11.30 గంటలకల్లా ప్రధానోపాధ్యాయుడు ముప్పా రవీంద్ర యొక్క అనుమతి లేకుండా, పాఠశాల నుండి ఇంటికి వెళ్లడం జరిగిన నేపథ్యంలో, హెచ్ ఎం రవీంద్ర, హిందీ పండితుడు బల్లిపల్లి వెంకటరమణ(బి వి రమణ)కు షోకాజు నోటీసు మంగళవారం జారీ చేసినట్లు డిప్యూటీ డిఈఓ ఎం వి వి ప్రసాద్ రావు తెలిపారు. గతంలో కూడా సంపాదిత సెలవులు హెచ్ఎం మంజూరు చేసినప్పటికీ అనంతరం పాఠశాలకు వచ్చి కనీసం రెండు గంటలు కూడా ఉండకుండా, రెండు పూటలా సంతకాలు పెట్టి ఎలాంటి సమాచారం ప్రధానోపాధ్యాయులకు ఇవ్వకుండా వెళ్లడం సహేతు కం కానీ నేపథ్యంలో, క్రమశిక్షణ చర్యలు కింద షోకాజ్ నోటీసు జారీ చేశామని పాఠశాల హెచ్ఎం. ముప్పా రవీంద్ర విశాలాంధ్ర రిపోర్టర్ కు తెలియజేశారు. బల్లిపల్లి వెంకటరమణ (బివి రమణ) అనే ఈ హిందీ పండితుడు ఆత్మానంద స్వామిగా ఆధ్యాత్మిక ప్రవచనాలు ఇస్తూ, క్రమశిక్షణ, త్యాగనిరతి, కర్తవ్య నిర్వహణ గురించి ఊక దంపుడు ఉపన్యాసాలు ఇచ్చే ఈ ప్రబుద్ధుడు తన వృత్తి నిబద్ధతను పక్కనపెట్టి, రెండు పూటలా ఉపాధ్యాయుల సంతకాల రిజిస్టర్లో సంతకాలు పెట్టి, పాఠశాలకు ఎగనామం పెట్టడం ఏ పాటి ధర్మం అని, విజ్ఞులు ప్రశ్నిస్తున్నారు. ప్రజాక్షేత్రంలో బాధ్యతాయుతమైన పాత్ర పోషిస్తూ, దేవుని సేవలో తరిస్తున్నానని చెప్పుకునే ఈ ప్రవచన కారుడు, విద్యార్థులకు పాఠాలు చెప్పకుండా, ఎగనామం పెట్టి, సంతకాలు పెట్టుకుని అప్పనంగా జీతాలు పొందడం, ఇటు ఆధ్యాత్మిక ప్రవృత్తికి , అటు పవిత్ర ఉద్యోగ ధర్మానికి, రెండిటికి కూడా తిలోదకాలు ఇచ్చినట్లేనని ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఘాటుగా విమర్శిస్తున్నారు. నీతి, నిబద్ధత, నిజాయితీ గురించి పక్కవాడికి బోధించడానికే నీతులు ఉంటాయి! అన్న చందంగా హిందీ పండిట్ బల్లిపల్లి వెంకటరమణ వ్యవహార శైలి ఉండడం పట్ల పలువురు తీవ్ర ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు.

సైదాపురంలో క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలపై సీఐడికి ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : 550 కోట్ల నుంచి ఎనిమిది వందల కోట్లను దోచుకున్నారు. శ్రీకాంత్ రెడ్డి దేశం విడిచి పారిపోయే అవకాశం ఉంది. పాస్ పోర్ట్‌ను రద్దు చేయాలి.సీఐడీ డిఎస్పీకి బద్రీనాథ్ అనే మైన్స్ యజమాని ఫిర్యాదు చేశారు. ఆదూరి బద్రీనాథ్ నెల్లూరులోని సిబిఐ ఆఫీస్ ఎదుట జరిగినా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సైదాపురం మండలం జోగుపల్లిలోని మాకు 240 ఎకరాలు పొలాలు ఉన్నాయి. వాటిలో 8 మైన్స్ మాకు ఉన్నాయి. రెండేళ్లుగా మా పొలాల్లో యథేచ్ఛగా అక్రమంగా మైన్స్ దోచేశారు.సజ్జల రామకృష్ణా రెడ్డి కనుసన్నల్లో బిరదవోలు శ్రీకాంత్ రెడ్డి, కొడవలూరు దనుంజయ్ రెడ్డి, మాజీమంత్రి కారుమూరు నాగేశ్వరరావు అల్లుడు సందీప్‌లు దౌర్జన్యాలు చేశారు. అదూరు శ్రీచరన్, కృష్ణయ్యలను అడ్డుపెట్టుకుని అక్రమాలకు పాల్పడ్డారు. లక్షల టన్నుల క్వార్జ్ ని మార్కెట్‌లోఅమ్మేశారు. 500 నుంచి 800 కోట్ల టన్నులు తవ్వేసి 6వేల కోట్ల నుంచి 8వేల కోట్ల రూపాయలు దోచేశారు. మేము అడిగితే కేసులు పెడుతాం అన్నారు.అని సీఐడీకి ఫిర్యాదు చేశాం. సిద్దలయ్య కొండ దేవస్థానాన్ని ఆనుకుని తవ్వేశారు. హైకోర్టులో కేసు వేశాం.హైకోర్టు ఆదేశాలు ఉన్నా ఉల్లంఘించారు. మా మైన్స్‌ని లాక్కొని సిండికేట్‌గా ఇతర ప్రాంతాలకు తరలించేశారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పోలీసు అధికారులకు కొత్త చట్టాలపై వీడియో కాన్ఫరెన్స్

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : నూతన చట్టాలు జులై 1వ తేది నుండి అమలులోకి రానున్న నేపథ్యంలో, నూతన చట్టాలపై పోలీస్ అధికారులకు, సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలనే ఉద్దేశంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా పోలీసు అధికారులకు కొత్త చట్టాలను వివరించిన అడిషనల్ యస్.పి.(అడ్మిన్), (క్రైమ్స్) లీగల్ అడ్వైజర్ర్లు. కొత్త చట్టాలపై ప్రతి ఒక్కరూ పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలిచట్టాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి. ప్రతి అంశాన్నీ పఠించాలని పేర్కొన్నారు. కేసుల దర్యాప్తు చట్ట పరిధిలో జరపాలని,నియమాలను పాటిస్తే ముద్దాయిలకు శిక్షలు పడతాయని తెలిపారు.భారత ప్రభుత్వం ప్రస్తుత సమాజానికి అనుగుణంగా మార్పులు చేసి వాటి స్థానాలలో భారతీయ న్యాయసంహిత,భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియంఅను నూతన చట్టాలనుభారత ప్రభుత్వం రూపొందించడం జరిగింది.కొత్త, పాతచట్టాలలో మార్పులు, చేర్పులను క్షుణ్ణంగా వివరించి, సందేహాలను నివృత్తి చేసినలీగల్ అడ్వైజర్ అనంతరం ఈ-సాక్ష్యా యాప్, సంకలన్ యాప్ గురించి వివరించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ నందు అడిషనల్ యస్.పి. (అడ్మిన్) సౌజన్య, అడిషనల్ యస్.పి.(క్రైమ్స్) ప్రసాద్, లీగల్ అడ్వైజర్ శ్రీ శ్రీనివాసులు రెడ్డి, సైబర్ సీఐ హుస్సేన్ బాషా,ఎస్సై సురేష్, ఐటికోర్సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన గంగమ్మ తిరునాళ్ళు

విశాలాంధ్ర-ఉదయగిరి : మండల పరిధిలోని కొండాయపాలెం పంచాయతీ గంగిరెడ్డి పల్లి లో వెలసిన శ్రీ అనంతపురి గంగాభవాని అమ్మవారి తిరుణాళ్ళు మంగళవారం రాత్రితో ఘనంగా ముగిసింది. సుమారు వందేళ్ల చరిత్ర కలిగిన ఈ గంగమ్మ అమ్మ వారి తిరునాళ్లకు మొక్కులు చెల్లించుకోవటానికి, మొక్కులు కోరుకొనేదానికి అనేక ప్రాంతాల నుండి భక్తులు తరలి వస్తారు. అన్ని వర్గాల ప్రజలు ఈ ఉత్సవం లో పాల్గొంటారు.అనంతపురి అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం నుండి ముగింపు వరకు తప్పకుండా ఎదో ఒక రోజు వర్షం కురవటం ఖచ్చితంగా జరుగుతుంది. ఇది అమ్మవారి మహిమగా ఈ ప్రాంత ప్రజలు నమ్ముతారు. అమ్మవారి గ్రామోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. మహిళలు భారీ సంఖ్యలో పొంగళ్ళు పెట్టారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులందరికి భోజనాలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గం లోని ప్రముఖులు, రాజకియ ప్రముఖులు హాజరు అయ్యారు.సాయంత్రం బండ లాగుడు పోటీలు నిర్వహించారు. సంస్కృతిక కార్యక్రమాలు కూడా భక్తులను ఆకట్టు కున్నాయి. అత్యంత వైభవంగా అమ్మవారి తిరునాళ్ళు నిర్వహించటం లో ప్రధాన భూమిక పోషించిన మన ఫౌండేషన్ ఛైర్మెన్ మన్నేటి వెంకట రెడ్డి ని స్థానిక నియోజకవర్గ ప్రజలు అమ్మవారి భక్తులు కొనియాడారు.



పిల్లలు బడిలో వుండాలి..పెద్దలు పనిలో ఉండాలి

విశాలాంధ్ర-ముత్తుకూరు : బడి ఈడు పిల్లలు ప్రతి ఒక్కరు చదువుకోవాలని, పెద్దలు మాత్రం పనికి వెళ్లాలని జిల్లా డిప్యూటీ డిఇ వో లక్ష్మీ ప్రసన్న తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలయోగి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు పాఠశాల నుండి బస్టాండ్ వరకు నిర్వహించిన ర్యాలీలు ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నేను బడికి పోతా కార్యక్రమం జిల్లా అంతట జరుగుతుందన్నారు. ఇప్పటికే బడి ఈడు కలిగిన పిల్లలందరూ బడిలో చేరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం జూలై 15 వరకు ఉన్నందున మిగిలిన వారందరినీ కూడా చేర్పించడం జరుగుతుందన్నారు. అనంతరం ఎంఈఓ. హేమ సుందర్ మాట్లాడుతూ 14 ఏళ్ల లోపు పిల్లలందరూ తప్పనిసరిగా చదువుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే గురుకుల పాఠశాలలో చదివే విద్యార్థులు మంచి క్రమశిక్షణ కలిగి ఉంటారని ఆయన తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి మధుసూదన్ మాట్లాడుతూ బాలికలు తప్పనిసరిగా గ్రాడ్యుయేషన్ పూర్తిచేయాలని ఆయన కోరారు. గ్రాడ్యుయేషన్ అయ్యేవరకు వివాహం చేయవద్దని తల్లిదండ్రులకు చెప్పడమే కాకుండా వారికి భరోసా కల్పించాల్సిన బాధ్యత విద్యార్థులపైనే ఉందన్నారు. గురుకుల పాఠశాలలో ఉత్తీర్ణత శాతం ఏడాది బాగా పెరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుజాత, పి ఈ డి, పి ఈ టి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నామీద ఆదాల పీడీ,307 కేసులు పెట్టారు -మైనార్టీ నేత సయ్యద్ సమీ

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : బారా షాహిద్ దర్గా వద్ద ముస్లింలవిశ్వాసాలను దెబ్బతీశారు :ముస్లింల మత విశ్వాసాలను దెబ్బతీయవొద్దని చెప్పినందుకు నెల్లూరు రూరల్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా ఉన్న ఆదాల ప్రభాకర్ రెడ్డి అధికారాన్ని అడ్డం పెట్టుకొని తనపై పీడీ యాక్టుతో పాటు 307 అక్రమ కేసులను బనాయిం చారని ముస్లిం మైనార్టీ నేత సయ్యద్ సమీ పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని లేక్యూ కాలనీలోని నివాసం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనపై మోపిన అక్రమ కేసులకు సంబంధించి ఆదాల ప్రభాకర్ రెడ్డి తన బిడ్డలపై ప్రమా ణం చేయాలని సవాల్ విసిరారు.టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీనేతలు రకరకాల విష ప్రచారాలకు చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైసీపీ చేసిన అరాచకాలకు తాను నిలువెత్తు నిదర్శనమన్నారు. తాను ఏ తప్పు చేయకపోయినా ఆదాల ప్రభాకర్ రెడ్డి ప్రోత్సాహంతో పీడీ యాక్ట్‌ను అక్రమంగా బనాయించి మూడు నెలల15 రోజులుకడప జైల్లో పెట్టారన్నారు. ఆసమయంలోతన భార్యబిడ్డలకు తన క్షేమ సమాచారాన్ని కూడా తెలియ నివ్వలేదన్నారు.వీటన్నిటికీ ఫలితాన్ని ఆదాల అనుభవిం చాలన్నారు. అధికారం పోగానే వైసిపి నుంచి రాజకీయ బ్రోకర్లు జోకర్లు సీజన్ బాయ్స్ గత మూడు రోజులుగా రకరకాలుగా మాట్లాడుతున్నారనిసోషల్ మీడియాలో విష ప్రచారం చేసిన ఓ బ్రోకర్ తనను చంపి వేస్తారని తాను ఒకముస్లిం కావడం వల్ల అని చెబుతూ నంగి వేషాలు వేస్తున్నాడని విమర్శించారు. తనపై అక్రమ కేసులు బనాయిస్తే ఈ బ్రోకర్ వెదవ ఎక్కడికివెళ్లాడని, ఆరోజు మాట్లాడలేదని ప్రశ్నించారు.ఆదాల ప్రభాకర్ రెడ్డి ఓనయ వంచకుడన్నారు. తనపై మోపిన కేసులకు సంబంధించి ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకుని వెళ్తానన్నారు.కోటంరెడ్డి సోదరులు నిత్యం ప్రజల్లో ఉన్నారు కాబట్టే వారు 35వేల భారీ మెజార్టీతో గెలుపొందారన్నారు. ఆదాల చరిత్ర ముగిసిపోయిందని ఆరోగ్యం కూడా సహకరించడం లేదన్నారు.వైసీపీ కార్య కర్తలు ఆదాలను నమ్ముకుంటే నట్టేట మునగడం ఖాయ మని వారు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు.

మోసాల పట్ల అప్రమత్తంగా ఉండండి : హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్

విశాలాంధ్ర- నెల్లూరు టౌన్ : హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ప్రముఖ స్టాక్ బ్రోకింగ్ కంపెనీ అనుబంధ సంస్థ, హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ లిమిటెడ్‌ల నకిలీ వాట్సాప్ గ్రూపులతో కంపెనీ దాని అధికారుల వలె నటిస్తూ మోసపూరిత కార్యకలాపాలకు పాల్పడుతున్న వారి పట్ల అప్రమత్తతతో వ్యవహరిస్తూ, వారి బారిన పడకుండా ఉండాల్సిందిగా వినియోగదారులను హెచ్చరించింది. హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ పెట్టుబడిదారులందరూ స్టాక్ మార్కెట్‌లో సూచనాత్మకమైన, హామీ ఇవ్వబడిన లేదా గ్యారెంటీడ్ రాబడిని అందిస్తుందనే ఏదైనా స్కీమ్ లేదా ప్రోడక్ట్‌కు సబ్‌స్క్రయిబ్ చేయకుండా ఉండాలని కోరింది. ఈ మోసపూరిత బృందాలు అధిక రాబడిని వాగ్దానం చేయడం ద్వారా సున్నితమైన సమాచారాన్ని వినియోగదారుల నుంచి రాబట్టడం తోపాటుగా నిధులను తస్కరించవచ్చునన్నారు. హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్ వంటి ట్రేడింగ్ ఆధారాలను ఇవ్వవద్దని తమ కస్టమర్‌లను కోరారు. హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ యొక్క సీడీఓ, సీఓఓ సందీప్ భరద్వాజ్ మాట్లాడుతూ "పెట్టుబడిదారులు మోసపూరిత కార్యకలాపాల పట్ల అప్రమత్తంగా ఉండటం, సమగ్ర పరిశోధన మరియు విశ్వసనీయ సమాచారం ఆధారంగా పెట్టుబడి నిర్ణయాలు తీసుకోవడం చాలా కీలకం. హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీ నుండి వచ్చినట్లు చెప్పుకునే ఏదైనా కమ్యూనికేషన్ యొక్క ప్రామాణికతను ఎల్లప్పుడూ ధృవీకరించుకోండి. మీరు మా అధికారిక ఛానెల్‌ల ద్వారా మాత్రమే లావాదేవీలు జరుపుతున్నారని నిర్ధారించుకోండి" అని అన్నారు. వాట్సాప్ లేదా ఏదైనా అనధికారిక ఛానెల్‌ల ద్వారా ఆధార్ లేదా పాన్ కార్డ్ వివరాలతో సహా వ్యక్తిగత సమాచారాన్ని హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ అభ్యర్థించదు. ఇంకా, వినియోగదారులు వాట్సాప్ గ్రూప్ లకు జోడించబడరు లేదా అధికారిక ప్లాట్‌ఫారమ్‌ల వెలుపల నిధుల బదిలీ కోసం అభ్యర్థించబడరు. అధికారిక హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ వెబ్‌సైట్ లేదా అధీకృత యాప్ స్టోర్‌ల వంటి విశ్వసనీయ మూలాల నుండి మాత్రమే యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలి. హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీలకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు క్లెయిమ్ చేసే ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు లేదా గ్రూప్ లను కస్టమర్‌లు ఎదుర్కొన్నట్లయితే, వారు వెంటనే వాటిని నిర్దేశిత కస్టమర్ సేవా బృందానికి నివేదించాలి.తదుపరి సహాయం కోసం లేదా స్కామ్ గురించి నివేదించడానికి, హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ కస్టమర్ సర్వీస్ 022-39019400లో సంప్రదించాలని కోరారు.

బొల్లి ప్రాణాంతకం వ్యాధి కాదు :డాక్టర్ పి.శ్రీలత రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : వరల్డ్ విటిలిగోడే సందర్భంగా మంగళవారం, కమ్యూనిటీ పారా మెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో బృందావనంలోని శ్రీస్కిన్ అండ్ హెయిర్ క్లినిక్‌లో విటిలిగో (బొల్లి) పై అవగాహన జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీలత రెడ్డి మాట్లాడుతూ (బొల్లి) విటిలిగో అనేది ప్రాణాంతకం ఏమీ కాదని, ఆ మాటకొస్తే అసలుఅది జబ్బేకాదని, అయినా తీవ్ర మానసిక వేదనకు గురవుతుంటారన్నారు.నలుగురిలోకి వెళ్లడానికి నామోషీపడుతూ, ఆత్మ న్యూనతకు లోనవుతుంటారని, తెల్లమచ్చ,తెల్లపూత ఇలా ఏపేరుతో పిలుచుకున్న సమాజంలో దీనిమీద ఎన్నో అపోహలు, భయాలు ఉన్నాయన్నారు. ఇది కేవలం చర్మం లో రంగు ఏర్పడే ప్రక్రియలో లోపం మూలంగానే వస్తుందన్నారు. చూడడానికి ఇబ్బందిగా అనిపించడం తప్పించి, ఇతరత్రా సమస్యలేవీ ఉండవని, ఇదేమి అంటువ్యాధి కాదన్నారు. ఈ విషయాలు తెలియకపోవడమే అపోహలకు తావిస్తుం దన్నారు. శరీరంలోపై కనిపించే అన్నితెల్ల మచ్చలు బొల్లికాదని చర్మంలో మెలనో సైట్ కణాలు తగ్గడం వల్ల బొల్లివ్యాధి సోకుతుందన్నారు. బొల్లి చికిత్సలో పూత మందులు, టాబ్లెట్లు, ఫోటోతెరపి లేజర్, సర్జరీలు అందుబాటులో ఉన్నాయన్నారు, వ్యాధి కనిపించిన తొలి దశలోనే వైద్య నిపుణులను సంప్ర దించి చికిత్స పొందుతే సమర్థవంతంగా నియంత్రించవచ్చుఅన్నారు. ఈ నెపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈరోజును 'వరల్డ్ విటిలిగో డే' గా ఈవ్యాధి పట్ల అపోహలను తొలగించే దానికి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని వారికి తెలియజేయడమే ముఖ్య ఉద్దేశం అన్నారు. అనంతరం పి.హెచ్.పి నాయకులు డాక్టర్ శ్రీలత రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీ.హెచ్.పీ జిల్లా నాయకులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, నరసాపురం ప్రసాదు, ఉప్పలపాటి రామదాసు, చిట్లూరి వీరయ్య పాల్గొన్నారు.

ఒంగోలు నుండితిరుమలకు కాలినడకన

టిడిపి యువతతో టిడిపి అధికార ప్రతినిధి నువ్వుల

విశాలాంధ్ర - రాపూరు : రాపూరు మీదుగా ఒంగోలు కు చెందిన తెలుగుదేశం పార్టీ యువత తెలుగు దేశం పార్టీ ఘన విజయం సాధించి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా అయిన సందర్భంగా ఒంగోలు నుండితిరుమ ల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించు కోనెందుకు కాలినడకన బయలుదేరారు. యువతను రాపూరు మండల స్థానికులు తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి నువ్వుల శివరామకృష్ణ వారిని కలిసి వారికి ఆర్థికసహాయం అందజేసారు.

50% సబ్సిడీతో విత్తనాలు పంపిణీ :ఏవో జహీర్ భాష

విశాలాంధ్ర- మనుబోలు : 50% సబ్సిడీతో విత్తనాలను పంపిణీ చేయడం ప్రారంభించామని మనుబోలు మండల వ్యవసాయ అధికారి జహీర్ భాషా పేర్కొన్నారు. మంగళవారం ఆయన మనుబోలు రైతు భరోసా కేంద్రంలో రైతులకు జనుమ, పెళ్లి పెసర విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుబోలు మండలంలో 50 శాతం సబ్సిడీతో జనుమా పెళ్లి పెసర విత్తనాలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. మండలంలోని ప్రతి రైతు భరోసా కేంద్రంలో బయోమెట్రిక్ విధానం ద్వారా రైతులు తమ పేరును ఆన్లైన్ చేసుకొని విత్తనాలు పొందాలని కోరారు .అంతేకాకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు ఎలాంటి కొరత లేకుండా విత్తనాలను అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. రైతులు విత్తనాలను తీసుకొని ఈ సంవత్సరం అధిక దిగుబడి సాధించాలని కోరుతున్నామన్నారు. కావున మండలంలోని ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా స్టాక్ అయిపోయిన వెంటనే మరలా కూడా స్టాక్ తీసుకువచ్చి రైతులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాష్ట్ర రైతు ప్రధాన కార్యదర్శి రాయపాటి కిరణ్ కుమార్, కలికి రమేష్ రెడ్డి, అంకయ్య గౌడ్, శ్రీనివాసులు రెడ్డి, పవన్ కుమార్ రెడ్డి, శివుడు రాజా గౌడ్, పుట్ట మస్తాన్,తదితరులు పాల్గొన్నారు.

నేను బడికి పోతా అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-ఉదయగిరి : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో స్థానిక మండల అభివృద్ధి అధికారిని ఈశ్వరమ్మ మండల విద్యాశాఖ అధికారి 2 శ్రీ తోట శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగింది ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి పాత బస్టాండు వరకు విద్యార్థినీ విద్యార్థులతో కలిసి ర్యాలీ, అనంతరం విద్యార్థినీ విద్యా ర్థులతో మానవాహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరువురు మండల అధికారులు మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో ఉన్నటువంటి బడిబయటి పిల్లలను గుర్తించి వారి వయసుకు తగ్గ తరగతిలో జులై 12వ తేదీ లోపు చేర్పించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని అన్నారు ప్రతి గ్రామంలో వాలంటీర్లు సచివాలయ సిబ్బంది ఉపాధ్యాయుల సహకారంతో బడి బయటి పిల్లలను గుర్తించి వారి వయసుకు తగ్గ తరగతిలో వారిని చేర్పించాలన్నారు ఆ విద్యార్థికి ఆ తరగతిస్థాయి అందుకునే అంతవరకు బ్రిడ్జ్ కోర్సును అందించాలని అన్నారు బడి బయటి పిల్లలందరినీ బడిలో చేర్పించి బడి బయటి పిల్లలు లేని గ్రామంగా ప్రకటించుకోవాలని ఇరువురు మండల అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలకేశవులు, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సయ్యద్ జాఫర్ మొహిద్దిన్ షేక్ షబ్బీర్ షేక్ మొహమ్మద్ గౌస్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులతో మండల స్థాయి సమీక్ష

విశాలాంధ్ర-ఉదయగిరి : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలోని స్త్రీ శక్తి భవనంలో నేను బడికి పోతా కార్యక్రమం పై మండలంలోని ప్రాథమిక ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం మంగళవారం ఈ సందర్భంగా జరిగింది ఈ కార్యక్రమం మండల అభివృద్ధి అధికారిని ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగింది ఈ కార్యక్రమంలో స్థానిక మండల అభివృద్ధి అధికారిని ఈశ్వరమ్మ మండల విద్యాధికారి తోట శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పరిధిలోని బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, బడి బయట ఉండకూడదన్నారు. గ్రామ సచివాలయం పరిధిలో డ్రాపౌట్స్ జాబితా తయారు చేయాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో డ్రాప్ అవుట్ లేకుండా, మండల స్థాయి కమిటీ పర్యవేక్షణలో, గ్రామస్థాయి కమిటీ ప్రతి కాలనీలో చిత్తశుద్ధితో, ప్రతిరోజు గృహాలను దర్శించి, తల్లిదండ్రులకు విద్యార్థినీ విద్యార్థులకు కిట్స్, మధ్యాహ్న భోజన పథకం, తల్లికి వందనం స్కీం లపై అవగాహన కల్పించాలన్నారు. పూర్తిస్థాయిలో బడి ఈడు పిల్లలను, బడిలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమం జూలై 12 లోపల పూర్తి చేయాలన్నారు. తర్వాత ఆ గ్రామాలన్నిటిని బడి బయటపిల్లలు లేని గ్రామంగా ప్రకటించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

బలరామిరెడ్డికి ఎమ్మెల్యే నివాళి

విశాలాంధ్ర-బిట్రగుంట : బోగోలు మండలం చెన్నారాయునిపాలెంకు చెందిన కోట బలరామిరెడ్డి మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి చెన్నారాయుని పాలెంలోని వారి నివాసంలో బలరామిరెడ్డిభౌతిక ఖాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బోగోలు మండల అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి లేళ్లపల్లి సుధీర్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు గోవింద స్వామి ఇరుముడి అన్న వితరణ

విశాలాంధ్ర - రాపూరు : రాపూరులోని మద్దుల మడుగు సమీపంలో వెలసియున్న శ్రీశ్రీశ్రీ మహావిష్ణువు శ్రీ అయ్యప్ప దేవాలయంలో శ్రీ వేంకటేశ్వర స్వామి(గోవింద) మాలదరించి ఈనెల 26 వతేది బుధవారం ఇరుముడితో తిరుమల తిరుపతికి కాలి నడకన బయలు దేరేందుకు బుధవారం దేవాలయంలో మహావిష్ణువు కీ అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హెూమంతో ఇరుముడి కార్యక్రమం నిర్వహించి మధ్యాహ్నం దేవస్థాన ప్రాంగణంలో అన్న వితరణ కార్యక్రమం కూడా నిర్వహిస్తున్న గోవింద మాలాదరణ ధరించిన తూ మాటి అంకారావు స్వామి ఇరుము డి కార్యక్రమం సందర్భంగా స్వంత నిదులతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని అలియా కమిటి తెలియజేసారు.

నేను బడికి పోతా కార్యక్రమానికి అనూహ్య స్పందన

విశాలాంధ్ర -కొండాపురం: మండలంలోని భీమవరప్పాడు యస్సీ ప్రాథమిక పాఠశాల పరిధిలోని ఎర్రబాలెం గ్రామంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.మాధవ, ఉపాధ్యాయులు మాధవరెడ్డి ల కోరిక మేరకు మండల విద్యాశాఖాధికారి ఆనందరావు, ఎస్. డి .సి. యం. జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, సాయిపేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఐ.బాలక్రిష్ణయ్య, గ్రామ పెద్దలు కొమ్మి.ప్రభాకర్, ఉపాధ్యాయులు యం.వెంకట్రావు తదితరులు నేను బడికి పోతా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు.బడి ఈడు కల్గిన ఎర్రబాలెం యస్టీ కాలనీకి చెందిన 10 మంది విద్యార్థులు పాఠశాలలో చేరేందుకు గ్రామ పెద్ద కొమ్మి.ప్రభాకర్ చూపిన చొరవను మండల విద్యాశాఖాధికారి ఆనందరావు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బాలక్రిష్ణయ్య లు కొనియాడారు. ఈ సందర్భంగా యం.ఇ.ఒ ఆనందరావు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలక్రిష్ణయ్య లు మాట్లాడుతూ.పాఠశాలలో చేరిన పిల్లలకు ప్రతి ఒక్క విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామన్నారు. యూనిఫాం,షూస్,బెల్ట్,బ్యాగ్, పుస్తకాలను స్టూడెంట్ కిట్ రూపంలో ఉచితంగా ప్రభుత్వం అందిస్తుంది. ఈ అవకాశాలన్నింటినీ ఉపయోగించుకొని అన్ని విధాల ఎదగాలని పేరెంట్స్‌కు సూచించారు.బడి ఈడు పిల్లలు బడికి పోవాలి కాని పని కాదని వారు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంధిరెడ్డికి నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలి

విశాలాంధ్ర-వరికుంటపాడు: గత వైసిపి పరిపాలనలో టిడిపి శ్రేణులపై జరిగిన పలు దౌర్జన్య ఘటనలపై ఉదయగిరి నియోజకవర్గంలో ప్రజలకు న్యాయబద్ధంగా అండగా నిలిచిన లీగల్ సెల్ అధ్యక్షులు సంధిరెడ్డి రామారావుకు నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని పలువురు నియోజకవర్గ ప్రజలు టిడిపి అధిష్టానానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సందర్భంగా సంధిరెడ్డి విశాలాంధ్ర ప్రతినిధితో మాట్లాడుతూ ఉదయగిరి నుంచి కాకర్ల సురేష్ గెలుపుకు అలాగే కార్యకర్తలకు అండగా నిలిచి గెలిపించుకోవడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు. న్యాయ విభాగంలో సముచిత స్థానం కల్పిస్తే ఇంకా మెరుగైన సేవలు అందిస్తానని ఆయన అన్నారు.

బోగోలులో వందల బస్తాల పనికిరాని ప్రభుత్వ సిమెంట్

విశాలాంధ్ర - బిట్రగుంట : బోగోలు మండల ప్రజా పరిషత్, గృహ నిర్మాణశాఖ కార్యాలయాల వెనకవైపు ఉన్న ఖాళీప్రదేశంలో మంగళవారం ప్రభుత్వానికి చెందిన వందలకొద్ది సిమెంటుబస్తాలు దర్శనమిచ్చాయి. వాటిలో కొన్ని బస్తాలలోసిమెంటు గడ్డలుకట్టి ఉండగా, మరికొన్ని బాగాఉన్న బస్తాలను స్థానికులుతీసుకుని వెళు తూకనిపించారు. బస్తాలపై నాట్ ఫర్ సేల్, గవర్నమెంట్ యూస్ ఓన్లీ అనే ముద్రలు వేసి ఉన్నాయి. దాంతోసిమెంటు బస్తాలు జగనన్నలే అవుట్‌ల నిర్మాణానికి తెచ్చినవిగా గుర్తించారు. సంబంధితశాఖ డిఈ రంగవర ప్రసాద్‌ను వివరణ కోరగా అవన్నీ పనికిరానిబస్తాలని,వాటికి పంచనామా నిర్వహించి ఉన్నతాధి కారులకు నివేదికలు సమర్పించామన్నారు. అయితే లబ్ధిదారులకు పంపిణీచేయాల్సిన సిమెంటు వందల కొద్ది బస్తాలు గడ్డలు కట్టేవరకు గోడౌన్లో ఎందుకు ఉన్నాయి? పనికిరాని వాటిని పారవేయకుండా కార్యాలయం వెనకవైపు ఎందుకు ఉంచారో తెలియాల్సిఉంది. పనికి రాకుండా పోయిన వందల బస్తాలకు ఎవరుబాధ్యత తీసుకుంటారని, ప్రభుత్వం సొమ్మంటే ఇంత నిర్లక్ష్యమా? అని పలువురుప్రశ్నిస్తున్నారు. గృహ నిర్మాణశాఖ కార్యాలయం ఆవరణంలో తుప్పుపడుతున్న ఇనుప చువ్వలు గుట్టలగావేసి ఉండడం గమనార్హం.

నెల్లూరు రూరల్ డిఎస్పీ వీరాంజనేయరెడ్డిపై బదిలీ వేటు

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : నెల్లూరు రూరల్ డిఎస్పీ వీరాంజ నేయరెడ్డిపై బదిలీవేటు పడింది. ఆయన్ను డిఎస్పీ విధుల నుండి తొలగిస్తూ గుంటూరు రేంజ్ ఐజి సోమవారం ఉత్తర్వులు జారీ చేశా రు.తక్షణం విధుల నుండి రిలీవ్ అయ్యి నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో రిపోర్ట్చే యాలని ఐజి ఆదేశించారు. ఎన్నికలకు ముందు16 నెలల క్రితం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వైసీపికి గుడ్ బై చెప్పి తెలుగుదేశం పార్టీచేరిన సందర్భంలో నెల్లూరు రూరల్ వైసీపి ఇంఛార్జ్‌గా నాటి నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్ రెడ్డి నియమితులైనారు. ఆదాల ప్రభాకర్ రెడ్డి ఇంఛార్జ్‌గా వచ్చిన కొద్ది రోజుల్లోనే రూరల్ డిఎస్పీగా వీరాంజనేయరెడ్డి నియమితులై నారు.తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో నేపద్యంలో సోమవారం వీరాంజ నేయరెడ్డిపై బదిలీ వేటు పడింది.కొత్త డిఎస్పీ వచ్చే వరకూ నెల్లూరు సిటీ డిఎస్పీ రూరల్‌కు ఇంఛార్జ్‌గా కొనసాగనున్నారు.

కొనసాగుతున్న కోవూరుపల్లి చెరువు ఆక్రమణల తొలగింపు

విశాలాంధ్ర - బిట్రగుంట : బోగోలు మండలంలోని కోవూరుపల్లి చెరువులో ఆక్రమణల తొలగింపు మంగళవారం కూడా కొన సాగింది. పత్రికలలో వస్తున్న కథనాల ఆధారంగా బోగోలు విశ్వనాథరావుపేటలోని డ్రైనేజీ నీళ్లు బి ఎమ్ ఆర్ వాటర్ ప్లాంట్ సమీపంలోని తూము గుండా చెరువులోనికి వెళ్ళవలసి ఉండగా ఆ ప్రాంతం ఆక్రమణకు గురైంది. దాంతోపాటు లచ్చారెడ్డి తోట కొవురుపల్లి రామస్వామి పాలెంరోడ్డు వైపుఉన్న చెరువు భూము లను ఇరిగేషన్ అధికారులు మంగళవారం స్వాధీనం చేసు కున్నారు. అధిక వర్షాలు తుఫానుల సమయంలో చెరువులోని అదనపు నీరు కలుజు గుండా క్రిందికి వెళ్ళవలసి ఉన్నప్పటికీ కలుజు పరిసరాలలో అక్రమంగా నిర్మించిన శాశ్వత కట్టడాలు వరదనీటి ప్రవాహానికి అడ్డంగా వున్నాయి. నీటిపారుదలశాఖ స్వాధీనం చేసుకున్న చెరువు భూముల్లో అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది

ఏసీబస్సు షెల్టర్లను తిరిగిప్రారంభించాలి- సిపిఐ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : నెల్లూరు నగరంలో 2018లో నారాయణ మంత్రిగా ఉన్న సమయంలో ప్రారంభించిన టువంటి ఏసీ బస్సు షెల్టర్లను ఆనాడు కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించినవి వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని కనుక మంత్రిగా బాధ్యత చేపట్టినటువంటి నారాయణ దీనిపై వెంటనే తగిన చర్య తీసుకొని ఆ బషీటర్లను నిర్మించాలని సిపిఐ నగర సమితి సహాయకార్యదర్శి సిరాజ్ సోమవారం జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు అదేవిధంగా పాత మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా నిర్మాణం దాదాపుగా పూర్తి అయిన ఘోష హాస్పిటల్ కూడా పూర్తిస్థాయిలో నిర్మాణం చేసి దానిని ప్రజలకు వినియోగించుకునే విధంగా చేయాలని అలాగే నగరంలోని కటారి పాలెం లో ఏర్పాటుచేసిన ఏసీ కమ్యూనిటీ హాల్ అది పిల్లర్ల పిల్లర్ల కే పరిమితమైందని కనుక తెలుగుదేశం అధికారం చేపట్టింది కాబట్టి వాటన్నిటిని మంత్రి నారాయణ గారి సర్వ తక్షణం పూర్తి చేయాలని ఈ విషయం జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు షాన్వాస్ అజీజ్ అహ్మద్ ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా, షబ్బీర్, కిషోర్, షాకీర్, వెంకటేశ్వర్లు, నయుం, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ కాబోతున్న పిహెచ్‌యన్లకు పదోన్నతులు కల్పించాలి

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : నెల్లూరు వైద్య,ఆరోగ్య శాఖలో మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఏఎన్ఎంగా గర్భిణీస్త్రీలకు బాలింతలకు పుట్టిన బిడ్డలనుండి16సంవత్సరాలు వచ్చేవరకు వైద్య పరమైన అన్నిరకాల ఆరోగ్య సేవలు,టీకాల కార్యక్రమాలు నిర్వహిస్తూ,కుటుంబ నియంత్రణా కార్య క్రమాలు నిర్వహిస్తూ,సీజనల్వ్యాధులు,కమ్యూనికేబుల్ నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ పై అవగాహన కలిగిస్తూ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేస్తూఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం సర్జరీలు చేయించుకున్న వారికి ఫాలోఫ్ సేవలు చేస్తూ 30 సంవత్సరాలు పైబడి సేవలందిస్తూ చివరి దశలో గెజిటెడ్ హెూదా కలిగిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పదోన్నతి పొంద కుండానే రాష్ట్ర వ్యాప్తంగా పదిమంది దరిదాపు ఈ ఐదురోజుల్లో రిటైర్డ్ అవుతున్నారని, పదోన్నతికిసంబంధించినయాన్యువల్ కాన్ఫెన్షియల్ రిపోర్ట్, డిపిసి ప్రాసెస్‌లో ఉందని వైద్య ఆరోగ్య శాఖలోనిరాష్ట్రస్థాయి ఉన్నతాది కారులు వెంటనే స్పందించి వీరికి పదోన్నతి కల్పించడం ద్వారా వారి చిరకాల కల కోరిక నెరవేరుతుందని ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు. పబ్లిక్ హెల్త్ నర్స్ సేవలందిస్తున్న వారికి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పదోన్నతి కల్పించేందుకు ప్రభుత్వ ఉన్నతాది కారులతో చర్చించి ఈనెల 30వ తేదీకి ఒక్కరోజు ముందుగా అయినా పదోన్నతి పొందే విధంగా సహాయం చేయాలని ఏపీ హంస జిల్లా అధ్యక్షులు చేజర్ల సుధాకర్ రావు విజ్ఞప్తి చేశారు. ఏపీ హంస రాష్ట్ర అధ్యక్షులు అరవ పాల్ హెల్త్ మినిస్టర్ని ప్రిన్సిపల్ సెక్రెటరీనికలిసి సిహెచ్‌ఓలపదోన్నతి గురించి చర్చించి రిటైర్మెంట్ చివరి దశలో వారికి పదోన్నతి కల్పించాలని కోరారు జిజిహెచ్ నెల్లూరులో జరిగిన సమావేశంలో ఏపీ హంస జిల్లా ట్రెజరర్ మజహోరుల్ల, జిల్లా నాయకులు వి జ్యోతి,వసంత కావలి ప్రెసిడెంట్ ఆర్సోమేశ్వరరావు వింజమూరు ప్రెసిడెంట్ చెంచురామయ్య,ఇందుకూరుపేట సెక్రెటరీ వరలక్ష్మి నెల్లూరు రూరల్ వైస్ ప్రెసిడెంట్ గౌస్ బాషా,తాలూకా జాయింట్ సెక్రెటరీ పృధ్వి,మహిళా ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి ఆనంను కలసిన జేసీ సేదుమాధవన్

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనం తరం నెల్లూరుకి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆనం రామ నారాయణ రెడ్డిని జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్ మర్యాదపూర్వకంగా కలిశారు. శుభాకాంక్షలు తెలిపారు.

పిల్లలకు మెరుగైన భోజనం పెట్టండి

విశాలాంధ్ర - బిట్రగుంట : ప్రభుత్వ పాఠశాలలలో అమలు జరుగుతున్న మధ్యాహ్న బోజన పథకం పేరుగొప్ప ఊరుదిబ్బగా ఉంది. ప్రభుత్వ పాఠశాలలలో మెనూ ప్రకారం మెరుగైనభోజనం అందిస్తున్నామని, రకరకాల కూరలతో కూడినభోజనం సరఫరా చేస్తు న్నామని, నాయకులు చెప్పుకుంటున్నప్పటికీ వాస్తవానికి రేషన్ బియ్యం కోడిగుడ్లు తప్ప తమకు ఇంకేమీ ఇవ్వడం లేదని మధ్యాహ్నం భోజన నిర్వాహకులు వాపోయారు. మంగళవారం బోగోలు సత్రం బడిలో భోజన సరఫరాదారులు మాట్లాడుతూ బియ్యం, కోడిగుడ్లు తప్ప కూరలకు వినియోగించే నిత్యవసర వస్తువులన్నీ తమ సొంత ఖర్చులతో కొనుగోలు చేస్తున్నామని రెండుమూడు నెలలకుగాని బిల్లులుచెల్లించే పరిస్థితి లేదన్నారు. దాంతో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఇంటివద్దనుండి భోజనం తీసుకుని వచ్చి, పిల్లలకు తినిపిస్తున్నారు. ఈ విషయమై వారిని ప్రశ్నించగా పాఠశాలలో భోజనం చేసినందువలన పిల్లలు అరుగుదల సమస్యలుతో ఇబ్బంది పడుతున్నారన్నారు. దాంతో ఇంటివద్దనుండి భోజనం తెస్తున్నామని సమాధానంచెప్పారు. అంగన్వాడి బడిలోని తనబిడ్డకు భోజనం తినిపించడానికి వచ్చిన బోగోలు జడ్పిటిసి కీర్తన మాట్లాడుతూ చిన్న పిల్లలకు పెట్టే భోజనం కనుక నాణ్యమైన బియ్యం, సకాలంలోనిత్యావసర సరుకులు అందించాల్సిన అవసరం ఉందన్నారు.

ఆర్‌బికేలో మాజీ సీఎం, మాజీ మంత్రి ఫోటోలు

విశాలాంధ్ర- మనుబోలు :ప్రభుత్వం మారిన మండల కేంద్రమైన మనుబోలు రైతు భరోసా కేంద్రంలోని బోర్డులు మారలేదని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ఫోటోలు రైతు భరోసా కేంద్రం లోని బోర్డుపై దర్శనం ఇస్తున్నాయని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. అన్ని కార్యాలయాల్లో బోర్డులో మాజీల బొమ్మలను తొలగించినా రైతు భరోసా కేంద్రం లో మాత్రం తొలగించక పోవడం విమర్శలకు దారి తీస్తుంది. ఇదిలా ఉండగా ఇటీవల అధికార పార్టీ నాయకులు ప్రభుత్వ కార్యాలయాల్లో మాజీల ఫోటోలను తీసి వేయాలని అధికారులను కోరిన విషయం తెలిసిందే, అదేవిధంగా మనుబోలు రైతు భరోసా కేంద్రంలోని మాజీల ఫోటోలను తొలగించాలని టిడిపి నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

కండలేరు జలాశయాన్ని సందర్శించిన బిజెపి నేత మిడతల రమేష్

విశాలాంధ్ర -రాపూరు : రాపూరు మండలంలోని కండలేరు జలాశయం (తెలుగుగంగ డ్యామ్) హెడ్ రెగ్యులే టర్ వద్ద నుండి డ్యాం గేట్లను మరి యు జలాశయం లో డెడ్ స్టోరేజ్ నీటిని బిజెపి నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడితల రమేష్ మంగళ వారంపరిశీలించారు.కండలేరు జలా శయం వున్న మండలంలోని పలు గ్రామాలకు సాగునీటి సౌకర్యం లేదు కండలేరు జలాశయం లో 30 టీఎం సీల సామర్థ్యం నుండి పైప్ లైన్ ద్వా రా వెలుగోను చెరువుకు నీరందించే చర్యలు చేపట్టాలని. అక్కడనుండి రాపూరు పెద్ద చెరువుతోపాటు 10 గ్రామాలకు నీరు అందించవచ్చునని కండలేరు ఏఈ తిరుమలయ్యకు రిప్రజెంటేషన్ ఇవ్వడం జరిగింది. కండలేరులో డెడ్ స్టోరేజ్ నీరు కు హెడ్ రెగ్యులేటర్ కు మధ్య మూడు కిలోమీటర్ల దూరం ఉంది .ఈ మా ర్గంలో పేరుకుపోయిన బురదను తొలగిస్తే డెడ్ స్టోరేజ్ నీరు వినియోగ తెచ్చే అవకాశం ఉందని మిడతల విజ్ఞప్తి చేశారు.స్ట్రక్ అయినడ్యామ్ గేట్లు మరమ్మత్తులు చేయించాలని విజ్ఞప్తి చేశారు.కండలేరు జలాశయం ముంపు నిరుద్యోగుల కు ఉద్యోగ అవకాశాలు వెంటనే కల్పించాలని. అవార్డుదారులు లో అర్హత కలిగిన వారు అంగీకరిస్తే నష్టపరిహారం చెల్లించాలని ఉద్యోగ కల్పనలో 150 సంవత్సరాలు పట్టే అవకాశం ఉన్నం దున ముంపు నిరుద్యోగులతో ప్రభు త్వం చర్చించాలని మిడతల రమేష్ డ్యామ్ అధికారులకు విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో గాలి అంకబాబు. ఆనంద రెడ్డి. సురేంద్రరెడ్డి. గణపతి. ఓజిలి సుధాకర్. నరాల సుబ్బారెడ్డి. ప్రశాంత్ కుమార్ .ధనుంజయ, హనుమంతరావు, ఆడిటర్ లక్ష్మణరా వు తదితరులు పాల్గొన్నారు.